## మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : జిల్లాలోని ఆదర్శ పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు మార్చి 10 వరకు పొడిగించినట్లు డీఈవో వాసంతి తెలిపారు. జిల్లాలోని కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో 100 సీట్లు, ఏడు నుంచి పదో తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు telanganams.cgg. gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

## 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించాలి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : జిల్లాలోని అన్ని పాఠశాల్లో ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డీఈవో వాసంతి తెలిపారు. విద్యార్థులకు వివిధ సైన్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు పేరెంట్స్ కమిటీ, స్థానికుల సహకారంతో ప్రోత్సాహకాలు, బహుమతులు అందించాలని సూచించారు. వివరాలకు 94901 12848 నెంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

## ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : తమిళనాడులోని పెరియార్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 28 నుంచి మార్చి 3 వరకు నిర్వహించే సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు కే వినేశ్, డీ శ్రీనివాస్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి తెలిపారు. మంగళవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించి, ప్రిన్సిపాల్ మాట్లాడారు. కాలేజీలో విద్యతోపాటు క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

## 'చైతన్య' ఫలితాలు విడుదల

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25: హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య(డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం) యూజీ 3, 5 సెమిస్టర్, బీటెక్., బీఫార్మసీ 5, 7 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కులపతి డాక్టర్ సీహెచ్ వీ పురుషోత్తమ్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. యూజీ 3, 5 సెమిస్టర్లలో 90.75 శాతం, బీటెక్ 5, 7 సెమిస్టర్లలో 92.50, బీఫార్మసీ 5, 7 సెమిస్టర్లలో 45.6 శాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ జీ దామోదర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం రవీందర్, ఫాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ జీ శంకర్‌లింగం, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ శంకరయ్య, ఓఎస్‌డీ డాక్టర్ కే వీరవెంకటయ్య, అడ్మినిస్ట్రేషన్ డీన్ ప్రొఫెసర్ ఎస్ కవిత, అడ్మిషన్స్ డీన్ డాక్టర్ ప్రత్యూషరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ జగదీశ్వర్ పాల్గొన్నారు.

## 11 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు, ఫిబ్రవరి 25 : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 11 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై పస్త శ్రీనివాస్ తెలిపారు. పంథిని శివారులో సోమవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11 ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# ప్రజలకు వేసవి రక్షణ ఏర్పాట్లు చేయాలి

**కలెక్టర్ పీ ప్రావీణ్య**

హనుమకొండ, ఫిబ్రవరి 25 : వేసవి దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు రక్షణ ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వేసవి యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలు వేసవిలో తీసుకోవాల్సిన చర్యలు, అవగాహన కార్యక్రమాలపై కలెక్టర్ చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రాల్లో సరిపడా ఓఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలకు అందించాలని ఆదేశించారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, షేడ్ నెట్లను ఏర్పాటు చేయాలన్నారు. నగర పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య సంరక్షణ సూత్రాలను తెలిపే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ వేసవిలో ఆరోగ్య సంరక్షణ సంబంధించిన అంశాలను వైద్య ఆరోగ్య సిబ్బందితో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాసరావు, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, వైద్య విధాన పరిషత్ ఆర్ఎంవో డాక్టర్ బాలకృష్ణ, ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అహ్మద్, డీపీవో లక్ష్మీ రమాకాంత్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, మిషన్ భగీరథ ఈఈ రామాంజనేయులు, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేశ్ పాల్గొన్నారు.



వేలేరు : పీచర గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**వేలేరులో అభివృద్ధి పనుల పరిశీలన**

వేలేరు : మండలంలోని పీచర, మల్లికుదుర్ల గ్రామాల్లో అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఉపాధిహామీ పనులపై అధికారులతో ఆరా తీశారు. పీచర గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. సెంటర్లకు కావాల్సిన ఎలక్ట్రిసిటీ అవసరాల కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే, మల్లికుదుర్లలో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. జీపీ భవనం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామానికి చెందిన బూర సంపత్ వ్యవసాయ క్షేత్రంలో నాటిన మామిడి మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మల్లయ్య, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కొమి, పంచాయితీరాజ్ డీఈ శిరీష, ఏఈ రూప, ఆర్ఐ సురేందర్, ఎంపీవో భాస్కర్, జీపీ సెక్రటరీలు రాజిరెడ్డి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కే నారాయణ

## ఢిల్లీలో బీజేపీ బ్లాక్‌మెయిల్‌తో గెలిచింది

**మోడీ గుప్పిట్లో రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యం**

**సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌ను మోడీ బ్లాక్ మెయిల్ చేశాడని, నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ ఇలాంటి బ్లాక్ మెయిల్ రాజకీయాల ద్వారా పార్టీలను బీజేపీ గుప్పిట్లో పెట్టుకుంటున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండలోని పార్టీ ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయించాలనుకొని కమ్యూనిస్టు దేశాలను బలహీనపరినట్లుగానే దేశంలో మోడీ తమ మాట వినని వారిపై రాజ్యాంగ సంస్థల చేత దాడి చేయించి దారికి తెచ్చుకుంటున్నారని ఆరోపించారు. మోడీ పాలనలో గజదొంగలు, దోపిడీదారులను వెనకేసుకురావడం వలన మొత్తం వ్యవస్థ దెబ్బ తిన్నదన్నారు. హిందూ మతతత్వ ముసుగులో ప్రజలను రెచ్చగొడుతున్నాడన్నారు. మోడీ, అదానీలు ట్రంపునకు మద్దతు తెలుపుతున్నారని మండిపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ శక్తులు బలపడుతూ రాజకీయాలను శాసిస్తున్నాయని, అమెరికాలో ఎలాన్ మస్క్, ఇండియాలో ఆదానీ ఒక్కటవుతున్నారని ఆరోపించారు. జ్యూడిషియల్‌తో సహ ఎన్నికల కమిషన్, ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను మోడీ తన గుప్పిట్లో పెట్టుకున్నాడన్నారు. ప్రస్తుతం జమిలి ఎన్నికల పేరుతో ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ కొత్త నాటకానికి తెర తీశాడని, ఇది రాష్ట్రాల స్వతంత్రాన్ని నియంత్రించడమేనన్నారు. గతంలో మోడీ పాలన బాగా ఉంటే 303 సీట్ల నుంచి 242కు ఎందుకు పడిపోయాయని ప్రశ్నించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఐకి రెండు ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని ఎన్నికల పొత్తులో భాగంగా మాట ఇచ్చిందని, దానికి కట్టుబడి ఉండాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, జక్కు రాజుగౌడ్, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, బత్తిని సదానందం, మాలోతు శంకర్, కామెర వెంకటరమణ పాల్గొన్నారు.




పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నారాయణ

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

శాయంపేట, ఫిబ్రవరి 25 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పరకాల ఆర్డీవో నారాయణ అన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల కోసం శాయంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 31వ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా దాన్ని ఆర్డీవో మంగళవారం పరిశీలించి, ఏర్పాట్లను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రం పరిధిలో 69 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణ, కార్యదర్శి రత్నాకర్ ఉన్నారు.

**ఉత్తమ ఫలితాలతోనే ప్రత్యేక గుర్తింపు**

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పరకాల ఆర్డీవో నారాయణ అన్నారు. శాయంపేటలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు మండలస్థాయి అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో గడ్డం భిక్షపతి, తహసీల్దార్ సత్యనారాయణ, రిటైర్డ్ ఎంఈవో భిక్షపతి, ప్రిన్సిపాల్ రేవతి పాల్గొన్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

## పాతికేళ్లకు అ'పూర్వ' కలయిక

శాయంపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని నేరేడుపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఘనంగా జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు వినుకొండ సీతారామన్న, బెజ్జంకి పూర్ణాచారి, పీ ప్రదీప్ కుమార్, ఆర్ జయపాల్‌రెడ్డి, వై జీవన్‌కుమార్, కే రాజేశ్, పీ సతీశ్, ఈ కిశోర్, ఆర్ శ్రీధర్, ఎం మజీనీత్, టీ విద్యాసాగర్, ఎస్కే అంజాద్, ఆర్ రాజు, ఎం ప్రభాకర్, పీ స్వాతి, డీ సంధ్యారాణి, బీ జ్యోతి, ఎం కవిత, ఏ ప్రణీత, ఎం సుమత పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

**గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే**

వరంగల్,ఫిబ్రవరి 25 : ఇంటింటి నుంచి స్వచ్ఛ ఆటో కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడంలో సహకరించాలని కోరారు. స్వచ్ఛ ఆటోల లాగ్ బుక్‌తో పాటు డ్రైవర్లకు లాగ్ బుక్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో కార్మికులు, డ్రైవర్లు యూనిఫాం ధరించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చేపట్టే కార్యక్రమాలను అమలు చేస్తూ క్రమబద్ధంగా చెత్త సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పన్నుల వసూళ్లలో నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలి**

పన్నుల వసూళ్లలో నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించాలని సీడీఎంఏ శ్రీదేవి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆమె మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పన్నుల వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పన్నుల వసూళ్లు వేగవంతం చేసేందుకు పలు సూచనలు చేశారు. కార్పొరేషన్ నుంచి కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే పాల్గొని బల్దియా పరిధిలో పన్నుల వసూళ్ల పురోగతిని సీడీఎంఏకు వివరించారు. ఈ ఏడాది పన్నుల లక్ష్యం రూ.117.26 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.51.91 కోట్లు వసూళ్లు చేసినట్లు ఆమె వివరించారు. మొండి బకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. పన్నుల వసూళ్లపై విస్తృత ప్రచారంతో పాటు బకాయిదారులకు మెసేజ్‌లు పంపిస్తున్నట్లు వివరించారు. పెద్ద మొత్తంలో ఉన్న బకాయిదారుల వద్దకు బృందాలుగా వెళ్లి వసూళ్లు చేస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అశ్వినీ తానాజీ వాకడే

# తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

**జడ్పీ సీఈవో విద్యాలత**

దామెర, ఫిబ్రవరి 25 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో ఎం విద్యాలత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని దామెర, ల్యాదెళ్ల, సింగరాజుపల్లి గ్రామాల్లోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, నర్సరీలను ఆమె పరిశీలించారు. అనంతరం మిషన్‌భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి నీటి సరఫరా కోసం వేసిన పైపులైన్ల పరిస్థితి, ప్రస్తుత ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నీటి కెపాసిటీని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పీ సీఈవో మాట్లాడుతూ గ్రామాల్లో పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, పంపుమోటర్లు, గేట్‌వాల్స్ మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. వేసవిలో నర్సరీల్లో మొక్కలు ఎండిపోయే అవకాశం ఉందని, వాటి సంరక్షణకు రోజూ నీటిని అందించాలని సూచించారు. తాగునీటి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గజ్జెల విమల, ఎంపీవో రంగాచారి, ఏపీవో శారద, పంచాయతీ కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యాలత

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హనుమకొండ, ఫిబ్రవరి 25 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ సఖీ సెంటర్ అడ్మిన్ హైమావతి అన్నారు. మంగళవారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని సఖీ సెంటర్‌లో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి సఖీ ముఖ్య ఉద్దేశాలు, అందిస్తున్న సేవల గురించి వివరించారు. మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సెంటర్ ద్వారా ఐదు రకాల సేవలతో పాటు, కౌన్సెలింగ్, వైద్యం, పోలీసు, న్యాయ సాయం, తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపుల నుంచి రక్షణ పొందడానికి సఖీ సెంటర్ పనిచేస్తుందని చెప్పారు. సమస్య ఉన్నప్పుడు 181 మహిళా హెల్ప్ లైన్ నెంబర్ లేదా చైల్డ్ లైన్ నెంబర్ 1098, 0870-2452112, 7382983088 నంబర్లకు కాల్ చేసి సాయం పొందవచ్చని తెలిపారు. సఖీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఉత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి, మోదుగుపువ్వులతో అలంకరించారు. ఆంజనేయస్వామి సన్నిధిలో మహాచండీయాగం నిర్వహించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ సతీశ్, మున్సిపల్ డీఈ రవీందర్, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి పాల్గొన్నారు. కాగా, మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రధానార్చకుడు తెలిపారు. సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం, గారెపల్లి మహేశ్వరశర్మ ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందని తెలిపారు. 12 మంది వేదపండితుల ఆధ్వర్యంలో లింగోద్భవకాలం పూజలు చేయనున్నట్లు ఈవో అనిల్‌కుమార్ తెలిపారు.

**ముస్తాబైన మెట్టుగుట్ట**

మడికొండ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మడికొండలోని మెట్టుగుట్ట ముస్తాబైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. చలువ పందిళ్లు వేసి, ప్రత్యేక క్యూలైన్‌లు, తాగునీటి వసతి కల్పించారు. కాజీపేట ఏసీపీ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి మార్చి 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



వేయిస్తంభాల గుడిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, గంగు ఉపేంద్రశర్మ

# మెట్టుగుట్టపై పొంచి ఉన్న ప్రమాదం

- రోడ్డు పక్కన కూలిపోయి ప్రమాదకరంగా రెయిలింగ్
- భద్రత కల్పించని అధికారులు, పోలీసులు

మడికొండ, ఫిబ్రవరి 25 : మహాశివరాత్రి పురస్కరించుకొని మడికొండ మెట్టుగుట్టపై అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ, గుట్టపైకి వెళ్లే రహదారి పక్కన ప్రమాదం పొంచి ఉన్నది. గుట్టపైకి వెళ్లే దారిలో మలుపు వద్ద రెయిలింగ్ కూలిపోయి ఏడాది కావొస్తున్నా సంబంధిత అధికారులు దాన్ని నిర్మించలేదు. సుమారు రెండు లక్షల మంది భక్తులు హాజరయ్యే మెట్టుగుట్టపై కనీసం ప్రమాదాన్ని సూచించే హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదు. జాతర సమయంలో కూడా ఎలాంటి పట్టింపు లేకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతర ఏర్పాట్లను ఎండోమెంట్, మున్సిపల్ అధికారులతో పాటు డీసీపీ, ఏసీపీ స్థాయి ఉన్నతాధికారులు సైతం పరిశీలించారు. కానీ, ప్రమాదకరంగా ఉన్న రోడ్డు వద్ద భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు మాత్రం చేపట్టలేదు. జాతరలో ఎలాంటి ప్రమాదం జరుగక ముందే పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని భక్తులు కోరుతున్నారు.



కూలిపోయి ప్రమాదకరంగా ఉన్న రెయిలింగ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో గణేశ్

## మత్తు పదార్థాలను నియంత్రించాలి

హనుమకొండ, ఫిబ్రవరి 25 : జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఫిబ్రవరి నెలలో నమోదైన 9 గంజాయి కేసులతో పాటు మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో చర్చించారు. డీఆర్‌వో గణేశ్, డీసీపీ షేక్ సలీమా మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించే, వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, హనుమకొండ, కాజీపేట ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, తిరుమల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐనవోలు మల్లన్నకు అశ్వవాహన సేవ

ఐనవోలు, ఫిబ్రవరి 25: ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అశ్వవాహనసేవ నిర్వహించి, కోలాటాలతో పురవీధుల్లో ఊరేగించారు. పాతర్లపాటి రవీందర్, మధుకర్‌శర్మ, పాతర్లపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అర్చకులు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జ్యోషి, అర్చకులు భానుప్రసాద్, నరేశ్‌శర్మ, మధుశర్మ, సిబ్బంది కిరణ్‌కుమార్, మధుకర్, రాజు, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు. కాగా, ఆలయంలోని నృతమండపంలో బుధవారం జరిగే పెద్దపట్నం ఏర్పాట్లను మామునూర్ ఏసీపీ తిరుపతి, సీఐ రాజగోపాల్, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. పెద్దపట్నం తొక్కె క్రమంలో తొపులాట జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

## ప్లానిటోరియం ఆధునీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి : మేయర్

వరంగల్, ఫిబ్రవరి 25 : కార్పొరేషన్ ఆవరణలోని ప్లానిటోరియం ఆధునీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. మంగళవారం ఆమె ప్లానిటోరియం పనులతో పాటు పైభాగంలో జరుగుతున్న ప్యాచ్ వర్క్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నవీనీకరణ పనుల్లో వేగం పెంచి, పాల్ సీలింగ్‌తో పాటు ఎలక్ట్రికల్ పనులు మార్చి 20లోగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశిత గడువులోగా ప్లానిటోరియాన్ని అందుబాటులోకి తీసుకరావాలని ఆదేశించారు.



డీఐఈవో గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## హాల్ టికెట్లు ఇవ్వని కాలేజీల గుర్తింపు రద్దు చేయాలి

**డీఐఈవో కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ధర్నా**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 : రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకు విరుద్ధంగా రకరకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి అక్రమంగా రూ.లక్షలు వసూళ్లకు పాల్పడుతూ, పూర్తిస్థాయి ఫీజు చెల్లించట్లేదనే నెపంతో ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ నరసింహారావు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఐఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఐఈవో గోపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, వంశీ, అజహర్, రాకేశ్, కార్తీక్, రవి, అఖిల్, మణిదీప్, కల్యాణ్, పృథ్వీ, వీరేశ్, సిద్ధు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

## ఘనంగా బేబీ సైనిక్ స్కూల్ వార్షికోత్సవం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 25 : శివాని విద్యాసంస్థల్లో ఒకటైన గోపాలపూర్‌లోని బేబీ సైనిక్ స్కూల్‌లో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాని విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం సల్మా తబస్సుమ్, పాఠశాల డైరెక్టర్లు జీ రవీందర్, జీ సురేందర్‌రెడ్డి, వీ చంద్రమోహన్, టీ రాజు, ఎస్ రమేశ్, ఏ శ్రీధర్, వీ సురేశ్, ఎస్ సంతోష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం

శాయంపేట, ఫిబ్రవరి 25 : శాయంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ కందకట్ల కోటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాసి, మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.